# క్షేమంగా భూమ్మీదకు సునీత

ఐఎస్ఎస్ నుంచి తిరిగొచ్చిన భారత సంతతి వ్యోమగామి • 286 రోజుల నిరీక్షణకు తెర • ఆమెతోపాటు విల్మోర్, మరో ఇద్దరు వ్యోమగాములు కూడా.. • ఫ్లోరిడా తీరంలో దిగిన క్రూ డ్రాగన్

న్యూయార్క్: సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో 286 రోజులుగా చిక్కుకుపోయిన భారత సంతతి నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ సురక్షితంగా భూమికి చేరుకున్నారు. భారత కాలమానం ప్రకారం బుధవారం వేకువజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్రజలాల్లో దిగారు. వారితోపాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గొర్బునోవ్ కూడా భూమికి తిరిగొచ్చారు.

**తిరుగు ప్రయాణం సాగిందిలా...**

- ఐఎస్ఎస్‌కు వీడ్కోలు పలికిన సునీతా విలియమ్స్, విల్మోర్ అంతరిక్ష కేంద్రానికి అనుసంధానమై ఉన్న క్రూ డ్రాగన్‌లోకి ప్రవేశించారు.
- అనంతరం భారత కాలమానం ప్రకారం 8.15 గంటలకు క్రూ వ్యోమనౌక హ్యాచ్ (తలుపులు) మూసివేత మొదలైంది.
- 10.30 గంటలకు ఐఎస్ఎస్ నుంచి అన్‌డాకింగ్ ప్రక్రియ పూర్తయింది.
- ఆ తర్వాత భూమికి తిరిగొచ్చే 17 గంటల ప్రయాణం మొదలైంది.
- పలుమార్లు కక్ష్య తగ్గింపు విన్యాసాల తర్వాత క్రూ భూ వాతావరణంలోకి ప్రవేశించింది.
- భూమిపై నుంచి స్పేస్ ఎక్స్, నాసా ఈ ప్రక్రియలను పర్యవేక్షించాయి.
- క్రమంగా వ్యోమనౌక వేగాన్ని తగ్గిస్తూ గల్ఫ్ ఆఫ్ అమెరికా, ఫ్లోరిడాలోని తలహీసి సముద్ర తీరంలో వ్యోమనౌక క్యాప్సుల్ సురక్షితంగా ల్యాండ్ అయింది.
- ల్యాండింగ్ సమయంలో వేగం కారణంగా క్యాప్సుల్ చుట్టూ భారీగా ప్లాస్మా ఏర్పడింది. కమ్యూనికేషన్ తెగిపోయి రేడియో సైలెన్స్ ఏర్పడింది. దీంతో కాసేపు ఉత్కంఠ నెలకొంది. అయితే, క్యాప్సుల్‌ను భారీ వేడి నుంచి ఉష్ణ కవచం సమర్థంగా రక్షించింది. సురక్షితంగానే ఉన్నట్టు కమాండర్ నిక్ హేగ్ రేడియో సందేశం పంపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న సిబ్బంది వారి వద్దకు చేరుకొని నౌకలోకి తీసుకొచ్చారు. కొన్ని నిమిషాల వ్యవధిలో వ్యోమగాములు ఒక్కొక్కరు అభివాదం చేసుకుంటూ అవనిపై అడుగుపెట్టారు.

**45 రోజుల రీహాబిటేషన్‌కు...**

సుదీర్ఘ కాలం పాటు జీరో గ్రావిటీలో గడిపిన వ్యోమగాములు భూమిపై ఉండే గురుత్వాకర్షణకు అలవాటు పడటం అంత సులువు కాదు. జీరో గ్రావిటీ వాతావరణంలో శరీరంలోని రక్తం సహా ద్రవాలన్నీ కింది భాగం నుంచి పైకి చేరుకుంటాయి. ఎముకల సాంద్రత తగ్గిపోతుంది. దీంతో భూమిపైకి చేరుకున్నాక వారు నిలబడేందుకు కూడా తీవ్రంగా ఇబ్బంది పడతారు. కనీసం పెన్సిల్‌ను కూడా ఎత్తలేని పరిస్థితి ఏర్పడుతుంది. తల తిరగడం, వికారం తదితర సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యోమగాములు తిరిగి రాగానే వారిని మొదట కుర్చీలో కూర్చోబెడతారు. ఆ తర్వాత వారిని రీహాబిటేషన్ సెంటర్‌లో కొంతకాలం పాటు ఉంచుతారు. ఇప్పుడు సునీతా సహా ఇతర వ్యోమగాములను 45 రోజుల పాటు నాసాకు చెందిన జాన్సన్ స్పేస్ సెంటర్‌లో రీహాబిటేషన్‌లో ఉంచనున్నట్టు తెలుస్తున్నది. ఇది మూడు దశల్లో సాగనున్నది. ఒక రోజుకు రెండు గంటల పాటు ఇది జరగనున్నది. 45 రోజుల సాధారణ సమయం. అయితే, కొన్ని పరిస్థితుల్లో ఇది నెలల పాటు కొనసాగే అవకాశం ఉన్నది. పూర్తిగా కోలుకునేందుకు కొంతమందికి సంవత్సరం కూడా పట్టవచ్చు. మొదటి దశలో భాగంగా నడిచేందుకు వీలుగా బలం, సామర్థ్యాన్ని తిరిగి పొందేందుకు వర్కవుట్ చేస్తారు. రెండో దశలో భాగంగా శరీరం తన సామర్థ్యాన్ని తిరిగి పొందేందుకు, మెదడు పనితీరు మెరుగుపరిచే ప్రక్రియలు ఉంటాయి. మూడో దశలో శారీరక ఫెర్మార్మెన్స్ బెస్ట్ లెవల్‌ను తిరిగి తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తారు.

**ఎందుకు ఉండాల్సి వచ్చిందంటే...**

2024 జూన్ 5న బోయింగ్‌కు చెందిన స్టార్ లైనర్ స్పేస్‌క్రాఫ్ట్‌లో 8 రోజుల అంతరిక్ష యాత్రలో భాగంగా సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. అయితే, అంతరిక్షానికి చేరుకునే క్రమంలోనే స్టార్‌లైనర్ 'కాలిప్సో'లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. హీలియం లీకేజీ, థ్రస్టర్స్ ఓవర్ హీటింగ్ తదితర కారణాల వల్ల వారు అంతరిక్షంలోనే ఉండాల్సి వచ్చింది. కాలిప్సోలో సమస్యల నేపథ్యంలో వారిని అందులో భూమిపైకి తీసుకురావడం సురక్షితం కాదని, నాసా భావించింది.

**అందుకే పిలవలేదు..**

భూమిపైకి సురక్షితంగా తిరిగొచ్చిన నాసా వ్యోమగాములను వైట్‌హౌస్‌కు ఎందుకు పిలవలేదన్న దానిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టత ఇచ్చారు. 'అంతరిక్షం నుంచి తిరిగొచ్చాక ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడటం అంత సులువు కాదు. రీహాబిటేషన్ సెంటర్‌లో ఉండాల్సి వస్తుంది. అందుకే వారిని పిలవలేదు. ఇంకా చాలా సమయం ఉంది. వారు కోలుకున్నాక పిలుస్తా' అని తెలిపారు.

**బైడెన్ వద్దన్నారు...**

వ్యోమగాములు సురక్షితంగా భూమికి చేరుకోవడాన్ని స్పేస్ ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ స్వాగతించారు. 'మరోసారి వ్యోమగాములను సురక్షితంగా భూమికి చేర్చిన స్పేస్ ఎక్స్, నాసాకు అభినందనలు. ఈ మిషన్‌కు ప్రాధాన్యం ఇచ్చిన ట్రంప్‌కు కృతజ్ఞతలు' అని ట్వీట్ చేశారు. మరోవైపు ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ... వ్యోమగాములను తిరిగి తీసుకొచ్చే విషయమై మాజీ అధ్యక్షుడు బైడెన్‌తో మాట్లాడానని, కానీ రాజకీయ కారణాలతో ఆయన తమ ఆఫర్‌ను తిరస్కరించారని ఆరోపించారు.

**అంతరిక్షంలో ఏం చేశారంటే..**

ఐఎస్ఎస్‌కు అవసరమైన మరమ్మతులు చేశారు. అంతరిక్ష వ్యవసాయం, అంతరిక్షంలో ఆరోగ్యం తదితర 150కి పైగా ప్రయోగాలు నిర్వహించారు. ఐఎస్ఎస్ భాగాలపై సూక్ష్మజీవులు వృద్ధి చెందుతున్నాయోమోననే విషయమై నమూనాలు సేకరించి, ప్రయోగాలు జరిపారు.

**భారత్‌లోనూ సంబురాలు...**

సునీత భూమికి సురక్షితంగా తిరిగి రావడంతో భారతీయులు సంబురాలు చేసుకున్నారు. సునీత పూర్వీకుల గ్రామమైన గుజరాత్‌లోని ఝూలాసన్‌తో పాటు పలు ప్రాంతాల్లో సంతోషాలు మిన్నంటాయి.

**ఏం తింటారంటే...**

అంతరిక్షంలోని పరిస్థితులకు అనుగుణంగా వ్యోమగాముల కోసం ప్రత్యేకంగా కొన్ని ఆహార పదార్థాలను నాసా తయారు చేస్తుంది. వీటిని ప్రతి మూడు నెలలకోసారి అక్కడి పంపిస్తారు. ఈ ఆహారం ఎక్కువగా ద్రవ రూపంలోనే ఉంటుంది. తాజా పదార్థాలు తినే ఆసార్కం ఉండదు. శీతల పానీయాలను వ్యోమగాములు వేడి చేసి తీసుకుంటారు. తగినన్నీ క్యాలరీలు ఉండేందుకు పొడి రూపంలో పాలు, చికెన్, ట్యూనా తదితర పదార్థాలను వ్యోమగాములు తీసుకుంటారు.



స్పేస్ఎక్స్ కాప్స్యూల్ నుంచి బయటకు వస్తూ అభివాదం చేస్తున్న సునీతా విలియమ్స్



ఫ్లోరిడా తీరంలో కాప్స్యూల్ ల్యాండింగ్



సునీతకు బికనీర్ విద్యార్థుల జేజేలు


## రోదసిలో రికార్డు

భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ అమెరికాలోని ఓహియో రాష్ట్రంలో 1965 సెప్టెంబర్ 19న జన్మించారు. ఆమె తండ్రి దీపక్ పాండ్యా గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఝూలాసాన్‌కు చెందినవారు. ఆయన అమెరికాకు వలస వెళ్లారు. స్లోవేకియాకు చెందిన బోని పాండ్యాను దీపక్ వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు. వారిలో సునీతా చిన్నవారు. సునీత 1983లో నదీమ్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేట్ పూర్తిచేశారు. 1987లో యూఎస్ నావల్ అకాడమీ నుంచి బీఎస్సీ డిగ్రీని పొందారు. 1987లో ఆమె నావల్ కెరీర్ ప్రారంభమైంది. ఈ అకాడమీలో ఉండగా.. తన సహచరుడైన మైకేల్ జే విలియమ్స్‌ను 1989లో పెండ్లి చేసుకున్నారు. 1995లో ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు. అనంతరం ఆమె వ్యోమగామి కెరీర్ మొదలైంది. ఆమె అనేక స్పేస్ మిషన్లను సమర్థంగా నిర్వహించారు.

- ఐఎస్ఎస్‌కు బయలుదేరిన తేదీ- 2024 జూన్ 5
- వ్యోమగాములు ఉన్న రోజులు- 286
- భూమి చుట్టూ ఆర్బిట్స్- 4577
- ప్రయాణించిన దూరం- 195.2 మిలియన్ కిలోమీటర్లు
- ఎక్కువ సమయం అంతరిక్షంలో గడిపిన మహిళా ఆస్ట్రోనాట్‌గా సునీతా రికార్డు.
- ఆమె 9 స్పేస్‌వాక్స్‌లో మొత్తం 62 గంటల పాటు అంతరిక్షంలో నడిచారు.

## బెంగళూరులో ఐటీ సంక్షోభం!

- గత ఏడాది 50 వేల మంది టెకీలకు ఉద్వాసన
- ఈ ఏడాదిలోనూ భారీగా ఉద్యోగ కోతలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పెరుగుతున్న ఆందోళన
- రియల్ వ్యాపారుల్లోనూ భయం భయం



బెంగళూరు: భారత సిలికాన్ వ్యాలీగా పేరొందిన బెంగళూరులో ఎన్నడూ లేని సంక్షోభం నెలకొంది. ఈ టెక్ హబ్ ప్రస్తుతం తీవ్ర ఉద్యోగ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. వ్యయ నియంత్రణ చర్యలతో పాటు ఆటోమేషన్, కృత్రిమ మేధ కారణంగా ఐటీ సెక్టార్‌లో చాలా సంస్థలు సామూహిక తొలగింపులు చేపడుతున్నాయి. 2024లో సుమారు 50 వేల మందిని ఉద్యోగాల నుంచి తొలగించినట్టు ఇన్‌షార్ట్స్‌లోని ఒక నివేదిక తెలిపింది. గత ఏడాది అర లక్ష మందిని తీసేశారని, ఈ ఏడాది ఎంతమందిని ఇంటికి పంపుతారో అర్థం కావడం లేదని ఐటీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఈ సంక్షోభ ప్రభావం హౌసింగ్, రియల్ ఎస్టేట్, స్థానిక వ్యాపారాలపైనా పడనుంది. రానున్న కొన్ని వారాలు, నెలల్లో ఐటీ సంస్థల్లో లేఆఫ్‌లు తీవ్రంగా ఉంటాయని భావిస్తున్నారు.

**చిన్న ఉద్యోగులకు పెద్ద కష్టం**

లేఆఫ్‌ల్లో ఎక్కువగా బాధితులుగా మిగిలేది దిగువ స్థాయి ఉద్యోగులే. ఆటోమేషన్, ఏఐ సంక్షోభం కారణంగా చేపట్టే కాస్ట్ కటింగ్‌లలో మొదట బలయ్యేది వీరే. వీరిలో ఎంట్రీ లెవెల్ ప్రోగ్రామర్లు, సాఫ్ట్‌వేర్ టెస్టర్లు అధికంగా ఉంటారు. వీరి స్థానాలను ఏఐ భర్తీ చేస్తుంది. కోడింగ్, డీబగ్, సాఫ్ట్‌వేర్ ఆప్టిమైజేషన్ వంటి పనులన్నీ పూర్తి సామర్థ్యంతో, అతి తక్కువ ఖర్చుతో ఏఐ ద్వారానే చేపడతారు. 'చాలామంది టెక్ ఉద్యోగులు ఆటోమేషన్ అన్నది సుదీర్ఘ ముప్పు అని గుర్తించడంలో విఫలమవుతున్నారు. దీంతో ప్రాథమికంగా అది ఉపాధి దృశ్యాన్నే మార్చేస్తుంది' అని ప్రముఖ కంపెనీ హెచ్ఆర్ హెడ్ ఒకరు తెలిపారు. గృహ నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం లేఆఫ్‌ల ప్రభావం తొలుత బెంగళూరులో పీజీ అకామిడేషన్లు, రెంటల్ మార్కెట్, తక్కువ అద్దెలుండే ఇండ్లపై పడుతుంది. చిన్న చిన్న ఉద్యోగుల్లో చాలామంది ఈ పీజీ అకామిడేషన్లలోనే ఉంటున్నారు. వారి ఉద్యోగాలు పోతే ఇవి కూడా ఖాళీ అవ్వడం ఖాయం. ఇప్పటికే పలువురు యజమానులు వీటిపై పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టి నెలసరి ఆదాయాన్ని పొందుతున్నారు. ఇప్పుడు వీటికి డిమాండ్ తగ్గితే ఆదాయం పడిపోవడంతో పాటు, ఆస్తుల విలువ కూడా తగ్గిపోతుందని, యజమానులు ఆందోళన చెందుతున్నారు. టెక్ పార్కులు, కార్పొరేట్ కార్యాలయాలకు హాట్ స్పాట్ లాంటి ఔటర్ రింగ్ రోడ్‌కు సమీపంలో పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టిన వారు కూడా హడలిపోతున్నారు. భవిష్యత్తులో బెంగళూరు ఉజ్వలంగా ఉంటుందని భావించి దీర్ఘ కాలం రెంటల్ ఆదాయం పొందే ధ్యేయంతో ఇప్పటికే ఇక్కడి వెంచర్లపై కోట్లాది రూపాయలను పెట్టుబడులుగా పెట్టారు. నిరుడు లేఆఫ్‌ల వల్ల రియల్ ఎస్టేట్ మార్కెట్ తగ్గుతూ వస్తున్నది. బెంగళూరు ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభమైన ఐటీ ఇండస్ట్రీకి సవాళ్లు ఎదురైతే అది పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

## 193 ఈడీ కేసుల్లో రెండింటిలోనే నేర నిర్ధారణ

- గత పదేండ్ల డాటాను వెల్లడించిన కేంద్ర సర్కారు

న్యూఢిల్లీ: గత పదేండ్లలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్(ఈడీ) 193 కేసులను నమోదు చేసిందని కేంద్రం మంగళవారం పార్లమెంట్‌కు తెలిపింది. ఈ కేసుల్లో నిందితులుగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ నాయకులు ఉన్నారని వెల్లడించింది. అయితే కేవలం రెండు కేసుల్లోనే నేర నిర్ధారణ జరిగిందని, ఇప్పటి వరకు ఏ కేసులోనూ ఏ నిందితుడికి విముక్తి లభించలేదని తెలిపింది. ఏప్రిల్ 2022-మార్చి 2023 మధ్య కాలంలో అత్యధికంగా 32 కేసులు నమోదయ్యాయని చెప్పింది. రాష్ట్రాల వారీగా, పార్టీల వారీగా ఎంత మంది ప్రజాప్రతినిధులపై ఎన్ని కేసులు నమోదయ్యాయన్న వివరాలు లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు.

## కాంగ్రెస్ నేతలకు డీఎన్ఏ టెస్టు!


**రాజస్థాన్ ఇన్‌చార్జి ప్రకటన**

న్యూఢిల్లీ: గుజరాత్ కాంగ్రెస్‌లోని కొందరు నాయకులు బీజేపీతో కుమ్మక్కయ్యారని, అవసరమైతే 20, 30 మంది నాయకులను ఏరి పారేయాలంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇటీవల పిలుపునిచ్చిన నేపథ్యంలో రాజస్థాన్‌లోని కాంగ్రెస్ కార్యకర్తలకు "విధేయతా పరీక్ష"ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించారు. తమ శరీరంలో కాంగ్రెస్ రక్తం ప్రవహిస్తున్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను సత్కరిస్తామని, అమ్ముడుపోయిన నాయకులను పార్టీ నుంచి బయటకు పంపిస్తామని రాజస్థాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెల్లడించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలలో డీఎన్ఏ చూడాలని రాహుల్ చెప్పారని, కాంగ్రెస్ పార్టీలో అటువంటి వ్యక్తులు 30 శాతం మంది ఉన్నారని, రాజస్థాన్‌లో నాయకులందరికీ డీఎన్ఏ టెస్టు చేస్తామని రాజస్థాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సుఖ్‌జీందర్ సింగ్ రణధావా తెలిపారు. అయితే ఈ టెస్టును ఎలా నిర్వహిస్తారో ఆయన చెప్పలేదు. సమావేశానికి గైర్హాజరైన వారి పేర్లు జాబితాలో ఎక్కుతాయని, వాటిని పీసీసీకి పంపుతామని ఆయన తెలిపారు.

## మోదీ ఎవరో తెలీదు

**70 శాతం మంది అమెరికన్ల వెల్లడి**

వాషింగ్టన్: మెజారిటీ అమెరికన్లకు మోదీ ఎవరో తెలియదట! భారత ప్రధాని ఎవరో తెలియదని 70 శాతం మంది అమెరికన్లు తెలిపారు. యూగవ్ తాజా సర్వేలో ఈ విషయం వెల్లడైంది. మరో సర్వేలో మోదీపై అభిప్రాయాలను అడిగారు. కేవలం 2 శాతం మంది మాత్రమే ఆయన పట్ల బలమైన ఇష్టాన్ని వెల్లడించారు. 11 శాతం మంది కొంత వరకు సానుకూలత ప్రకటించారు. మంగోల్ సామ్రాజ్య స్థాపకుడు చెంఘిజ్ ఖాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల కన్నా మోదీకి తక్కువ ర్యాంకు ఇచ్చారు. మహాత్మా గాంధీ పట్ల 61 శాతం మంది సానుకూలతను వ్యక్తం చేశారు. ఆయన మంచి నాయకుడని చెప్పారు. దీంతో ఆయనకు టాప్ 10లో చోటు లభించింది. మోదీ నెట్ ఫేవరబిలిటీ మైనస్ 3 లభించింది.




## భర్తను చంపి.. 15 ముక్కలుగా నరికి..

- మర్చంట్ నేవీ ఉద్యోగి దారుణ హత్య
- ప్రియుడితో కలిసి భార్య ఘాతుకం
- యూపీలోని మీరట్‌లో ఘటన
- తమ కుమార్తెను ఉరి తీయాలన్న నిందితురాలి తల్లిదండ్రులు

న్యూఢిల్లీ, మార్చి 19: వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడని ప్రియుడితో కలిసి భర్తను భార్య దారుణంగా హత్యచేసింది. అనంతరం అతడి శరీరాన్ని 15 ముక్కలు చేసి, డ్రమ్ములో వేసి సిమెంట్‌తో సీల్ చేసిన దారుణ ఘటన యూపీలో వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తన కుమార్తె పుట్టిన రోజు వేడుక కోసం లండన్ నుంచి వచ్చిన మీరట్ నివాసి సౌరభ్ రాజ్‌పుత్ (35)ను అతని భార్య ముస్కాన్ రస్తోగి, ఆమె ప్రియుడు సాహిల్ శుక్లా దారుణంగా హత్య చేశారు. లండన్‌లో మర్చంట్ నేవీ అధికారిగా పనిచేసే సౌరభ్.. రస్తోగిని 2016లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. 2019లో వీరికి ఒక పాప జన్మించింది. పెళ్లయిన తర్వాత భార్యతోనే కలిసి ఉండాలని ఉద్యోగానికి రాజీనామా చేశాడు. తర్వాత ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభం కావడంతో అద్దె ఇంట్లోకి మారారు. తన భార్యకు సాహిల్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉన్నట్టు గుర్తించిన సౌరభ్ ఆమెతో విడాకులు తీసుకోవాలని ఆలోచించాడు. అయితే కూతురు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఆ ఆలోచన విరమించుకున్నాడు. 2023లో తిరిగి మర్చంట్ నేవీలో చేరేందుకు లండన్ వెళ్లాడు. ఫిబ్రవరి 28న కుమార్తె పుట్టిన రోజు కోసం 24నే భారత్ వచ్చాడు. మార్చి 4న సౌరభ్ భోజనంలో ఆమె భార్య ముస్కాన్ నిద్ర మాత్రలు కలిపింది. తర్వాత సాహిల్, ఆమె కలిసి అతడిని చాకుతో పొడిచి హత్య చేశారు. మృతదేహాన్ని 15 ముక్కలు చేసి దానిని ఒక ప్లాస్టిక్ డ్రమ్ములో వేసి దానిలో సిమెంట్ నింపి సీల్ చేశారు. బంధువులు, స్నేహితులను తప్పుదోవ పట్టించడానికి సౌరభ్ ఫోన్ ద్వారా మెసేజ్‌లు పంపారు. అయితే ఎన్నిసార్లు ఫోన్ చేసినా జవాబు రాకపోవడంతో అతని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, సౌరభ్‌ను తామే చంపినట్టు అంగీకరించారు. దీంతో 15 రోజులుగా ఫ్లాట్‌లోని డ్రమ్ములో సిమెంట్ మధ్య గడ్డకట్టి ఉన్న సౌరభ్ అవశేషాలను పోలీసులు గుర్తించారు. పగలకొట్టినా అవి బయటకు రాకపోవడంతో డ్రిల్లింగ్ చేసి బయటకు తీసి, ఫోరెన్సిక్‌కు పంపారు.

**డ్రగ్స్‌కు అలవాటు పడి..**

తమ కుమార్తె దారుణ చర్యపై రస్తోగి తల్లిదండ్రులు తీవ్రంగా మండిపడుతున్నారు. ముస్కాన్, సాహిల్ ఇద్దరూ డ్రగ్స్‌కు అలవాటు పడి ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపించారు. సౌరభ్‌ను హత్య చేసినట్టు ముస్కాన్ తమ వద్ద అంగీకరించిందన్నారు. కొడుకు లాంటి సౌరభ్‌ను పొట్టనపెట్టుకుందని, ఆమెకు జీవించే హక్కు లేదని, ఆమెను ఉరి తీయాల్సిందేనని వారు అన్నారు.



## కుక్క ఖరీదు రూ.50 కోట్లు

కాడాబాంబ్ ఒకామి అనే ఈ అరుదైన 'ఓల్ఫ్ డాగ్' ఖరీదు అక్షరాలా రూ.50 కోట్లు. ఖరీదైన శునకాలను సేకరించే బెంగళూరుకు చెందిన ఎస్ సతీశ్ దీని యజమాని. తోడేలు, కాకాసియన్ షెపర్డ్ సంకరజాతికి చెందిన ఈ శునకం ప్రపంచంలోనే మొదటిది, అత్యంత ఖరీదైనదని న్యూయార్క్ పోస్ట్ తెలిపింది. 150 అరుదైన రకాల శునకాలు తన వద్ద ఉన్నాయని, ఈ రకాన్ని భారత్‌కు పరిచయం చేసేందుకు దానిని అంత ఖరీదుతో కొనుగోలు చేసినట్టు సతీశ్ తెలిపారు.

## గేట్ 2025 ఫలితాల విడుదల

న్యూఢిల్లీ: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్ (గేట్), 2025 ఫలితాలను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ బుధవారం విడుదల చేసింది. అభ్యర్థులు గేట్ 2025 అధికారిక వెబ్‌సైట్ https://goaps.iitr.ac.in/login ద్వారా ఫలితాలను తెలుసుకోవచ్చు. స్కోర్ కార్డులను ఈ నెల 28 నుంచి మే 31 వరకు ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి టెస్ట్ పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించవలసి ఉంటుంది. ఐఐటీ రూర్కీ ఈ పరీక్షలను ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో నిర్వహించింది.

## కెనడీ హత్య వెనుక సీఐఏ హస్తం?

న్యూఢిల్లీ: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ హత్యలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ హస్తంపై ట్రంప్ సర్కారు తాజాగా విడుదల చేసిన రహస్య దస్త్రాలు అనుమానం వ్యక్తం చేశాయి. కెనడీ హత్య వెనుక సీఐఏ హస్తం ఉండొచ్చని మొదటి నుంచి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీఐఏ పాత్రను నేరుగా వెల్లడించనప్పటికీ హత్యకు సంబంధించి ముందస్తు హెచ్చరికలను సీఐఏ నిర్లక్ష్యం చేసిందని రహస్య దస్త్రాలు నిందించాయి. 1963లో కెనడీ డల్లాస్‌లో హత్యకు గురయ్యారు. కాన్వాయ్‌లో వెళుతున్న కెనడీపై కాల్పులు జరపడంతో ఆయన మరణించారు.

## 'పిల్లలు చూసుకోకుంటే గిఫ్ట్ డీడ్ రద్దు'

చెన్నై: తమ సంరక్షణను పట్టించుకోని పక్షంలో తమ పిల్లలు లేదా సమీప బంధువులకు చేసిన గిఫ్ట్ డీడ్లు లేదా సెటిల్‌మెంట్ డీడ్లను రద్దు చేసుకునే హక్కు సీనియర్ సిటిజన్లకు ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. డీడ్లలో ఒక వేళ అటువంటి షరతులు ఏమీ లేనప్పటికీ వాటిని రద్దు చేసుకునే హక్కు సీనియర్ సిటిజన్లకు ఉంటుందని హైకోర్టు ధర్మాసనం తాజాగా తేల్చి చెప్పింది. సీనియర్ సిటిజన్ ఎస్ నాగలక్ష్మి కోడలు ఎస్ మాల దాఖలు చేసిన అప్పీలును కొట్టివేస్తూ ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

## ఏపీ ఎమ్మెల్యేలే అత్యంత సంపన్నులు

- సగటు ఆస్తి 65 కోట్లు.. దేశంలోనే అత్యధికం
- టాప్-10 సంపన్నుల్లో నలుగురు టీడీపీ వారే
- 11వ ర్యాంకులో తెలంగాణ ఎమ్మెల్యే జీ వివేకానంద
- పార్టీల వారీగా బీజేపీ సభ్యులకే ఎక్కువ ఆస్తులు

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్యేలు దేశంలోనే అత్యంత సంపన్నులని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) సంస్థ తాజా నివేదికలో వెల్లడించింది. ఏపీ ఎమ్మెల్యేల సగటు ఆస్తి 65 కోట్లు అని, ఇది దేశంలోనే అత్యధికమని తేల్చింది. పార్టీ పరంగా చూస్తే దేశ వ్యాప్తంగా బీజేపీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎక్కువగా ఆస్తులు కూడగట్టారని చెప్పింది. బీజేపీకి చెందిన ముంబై, ఘట్కోపర్ తూర్పు ఎమ్మెల్యేగా పరాగ్ షా రూ.3,400 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక ఎమ్మెల్యేగా నిలిచారు. దేశంలోని టాప్-10 సంపన్న ఎమ్మెల్యేల్లో నలుగురు టీడీపీకి చెందినవారే. తెలంగాణ ఎమ్మెల్యే జీ వివేకానంద (చెన్నూరు) 11 వ స్థానంలో ఉండగా, కే రాజగోపాల్ రెడ్డి (మునుగోడు) 15, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి (పాలేరు) 19వ స్థానంలో ఉన్నారు.



దేశంలోనే సంపన్న ఎమ్మెల్యే- పరాగ్ షా (బీజేపీ- ఘట్కోపర్ తూర్పు, ముంబై)
ఆస్తులు - రూ.3,400 కోట్లు
అతి తక్కువ ఆస్తి ఉన్న ఎమ్మెల్యే- నిర్మల్ కుమార్ ధారా (ఇండస్, పశ్చిమ బెంగాల్)
ఆస్తి- రూ.1,700

**ఎమ్మెల్యేల అత్యధిక సగటు ఆస్తులు (రూ. కోట్లలో)**

| | |
|---|---|
| ఆంధ్రప్రదేశ్ | - 65.07 |
| కర్ణాటక | - 63.58 |
| మహారాష్ట్ర | - 43.44 |
| తెలంగాణ | - 38.00 |

**అత్యల్ప సగటు ఆస్తులు**

| | |
|---|---|
| త్రిపుర | - 1.51 |
| బెంగాల్ | - 2.80 |
| కేరళ | - 3.13 |

**తెలంగాణలో వీరు టాప్**

| ఎమ్మెల్యే | ఆస్తి |
|---|---|
| జీ వివేకానంద | 606 కోట్లు |
| కే రాజగోపాల్ రెడ్డి | 458 కోట్లు |
| పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి | 433 కోట్లు |

**ఏపీలో వీరు టాప్**

| ఎమ్మెల్యే | ఆస్తి |
|---|---|
| చంద్రబాబు | రూ.931 కోట్లు |
| పీ నారాయణ | రూ.824 కోట్లు |
| వై.ఎస్.జగన్ | రూ.757 కోట్లు |
| వీ ప్రశాంత్ రెడ్డి | రూ.716 కోట్లు |



శంభూ సరిహద్దు వద్ద జేసీబీతో రైతుల టెంటుల తొలగింపు

## అన్నదాతలపై ఉక్కుపాదం

- ఖనౌరీ, శంభూ సరిహద్దు వద్ద రైతుల నిరసన శిబిరాల తొలగింపు
- వందల సంఖ్యలో అన్నదాతల అరెస్టు
- పంజాబ్ పరిహద్దులో ఇంటర్నెట్ బంద్

చండీగఢ్, మార్చి 19: గత ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రైతులు నిరసన కొనసాగిస్తున్న ఖనౌరీ, శంభూ సరిహద్దు పాయింట్ల వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక శిబిరాలను పంజాబ్ పోలీసులు బుధవారం బలవంతంగా తొలగించారు. రైతులను అక్కడ నుంచి తరిమివేసిన పోలీసులు తాత్కాలిక గుడారాలను కూల్చివేశారు. శంభూ, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్దకు వెళుతున్న రైతు నాయకులు జగ్జీత్ సింగ్ దల్లేవాల్, సర్వన్ సింగ్ పంధేర్‌తోసహా 200 మంది రైతులను పంజాబ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొహాలీ వద్ద దల్లేవాల్, పంధేర్‌ను అదుపులోకి తీసుకోగా ఖనౌరీ సరిహద్దు వద్ద మరో 200 మంది రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రెండు సరిహద్దు పాయింట్ల వద్ద భారీ సంఖ్యలో భద్రతా దళాలను మోహరించారు. అంబులెన్సులు, బస్సులు, అగ్నిమాపక శకటాలను అక్కడ నిలిపారు. ఖనౌరీ సరిహద్దు వద్ద దాదాపు 3000 మంది పోలీసు సిబ్బందిని మోహరించారు. శంభూ సరిహద్దు వద్దకు మరో పోలీసు బలగాన్ని పంపించారు. రైతులు తమ టెంట్లను ఖాళీ చేసేందుకు పోలీసులు వారికి 10 నిమిషాల వ్యవధి ఇచ్చారు. బస్సులలో అక్కడి నుంచి తరలిస్తామని వారు హెచ్చరించారు. ఖనౌరీ సరిహద్దుతోపాటు పంజాబ్‌లోని సంగ్రూర్, పాటియాలా జిల్లాలలోని పరిసర ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. అంతకుముందు కేంద్రంతో రైతులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

## యూపీఐ చిన్న లావాదేవీలకు ప్రోత్సాహకం

న్యూఢిల్లీ: చిన్న మొత్తంలోని యూపీఐ లావాదేవీలను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్లతో ప్రత్యేక పథకాన్ని కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదించింది. దీంతో రూ.2 వేలలోపు లావాదేవీలపై ఎలాంటి చార్జీ ఉండదు. ఆ లావాదేవీలపై వ్యాపారులకు మనం చెల్లించాల్సిన మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్)ను ప్రభుత్వమే భరిస్తుంది. రూ.2 వేలు లేదా అంతకంటే తక్కువ విలువ కలిగిన ప్రతి యూపీఐ లావాదేవీపై వ్యాపారులకు ప్రభుత్వం 0.15% మొత్తాన్ని ప్రోత్సాహకంగా అందజేస్తుంది. ఈ పథకం ఈ ఏడాది మార్చి 31 వరకు అమలవుతుంది.

## గాజాలో మళ్లీ గ్రౌండ్ ఆపరేషన్

జెరుసలేం: ఉత్తర గాజాపై ఇజ్రాయెల్ బలగాల వైమానిక దాడులు రెండో రోజు బుధవారం కొనసాగాయి. ఈ దాడుల్లో గాజా సిటీలో ముగ్గురు, బీట్ హనోన్‌లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్టు గాజా ఆరోగ్యశాఖ ప్రకటించింది. గాజా కారిడార్‌లో అత్యంత కీలకమైన కొంతభాగాన్ని స్వాధీనం చేసుకోవడానికి పరిమిత స్థాయి 'గ్రౌండ్ ఆపరేషన్' చేపట్టినట్టు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. బందీలను హమాస్ విడిచిపెట్టకపోతే, ఊహించలేని స్థాయిలో దాడులు ఉంటాయని ఇజ్రాయెల్ రక్షణమంత్రి హెచ్చరించారు.